సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి
9705347494
నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

మార్మోగిన గోవింద నామస్మరణ



శ్రీవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

కొమ్మాది: రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం శ్రీవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. వేకువజామున సుప్రభాత, తోమాల సేవ అనంతరం భక్తులకు సర్వదర్శనం కల్పించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వందలాది మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన కోలాటాలు, గోవింద నామ కీర్తనలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.

గొట్టిపల్లిలో ఉచిత వైద్య శిబిరం నేడు

ఆనందపురం : మండలంలోని గొట్టిపల్లిలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు శ్రీ సత్యసాయి సేవా సమితి ప్రతినిధులు ఓ ప్రకటనలో తెలిపారు. గొట్టిపల్లి దేవాలయం వార్షికోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న ఈ శిబిరంలో కన్ను, ముక్కు, చెవితో పాటు వివిధ రకాల సాధారణ వ్యాధులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేస్తారని, ఈ అవకాశాన్ని చుట్టుపక్కల గ్రామాల ప్రజలు వినియోగించుకోవాలని సేవా సమితి సభ్యులు కోరారు.

26న కాశీలో వారాహి, భైరవ హోమం

తగరపువలస: చిట్టివలసకు చెందిన శ్రీ విద్యా గణపతి జ్యోతిషాలయం అధినేత సోమయాజుల కల్యాణ చక్రవర్తి శర్మ ఆధ్వర్యంలో ఈ నెల 26న కాశీలో వారాహి, భైరవ ఆరాధన హోమం నిర్వహించనున్నారు. ఆషాఢ శుద్ధ పంచమి సందర్భంగా నిర్వహించే ఈ కార్యక్రమాల్లో ఆసక్తి కలిగిన వారు పాలుపంచుకోవాలని కోరారు. వివరాలకు 89783 73743, 83283 05636లో సంప్రదించాలని కోరారు.

ఉచిత యోగా శిక్షణ తరగతులు ప్రారంభం

తగరపువలస: చిట్టివలస శ్రీలక్ష్మి శ్రీనివాస కల్యాణ మండపంలో శనివారం ఉచిత యోగ శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. 9వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా భీమిలికి చెందిన అంతర్జాతీయ యోగ పరిశోధన, శిక్షణ సంస్థ ఈ నెల 21 వరకు శిక్షణను కొనసాగిస్తుంది. విద్యార్థుల్లో ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెంపొందించేందుకు, వ్యక్తిత్వ వికాసానికి, శరీరంలో వివిధ రుగ్మతల నివారణకు యోగా దోహదపడుతుందని నిర్వాహకులు తెలిపారు. ఉదయం 5.30 నుంచి 7 గంటల వరకు అందించే శిక్షణలో పాల్గొనాలనుకునే వారు 08933 – 228222లో సంప్రదించాలని కోరారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం



చెక్కు అందజేస్తున్న రాంబాబు కుటుంబీకులు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి శనివారం లక్ష రూపాయల విరాళాన్ని నగరంలోని గాజువాక దరి బీసీ రోడ్డు ప్రాంతానికి చెందిన వి.రాంబాబు అందజేశారు. సింహగిరిపై స్వామి దర్శనం కోసం శనివారం వచ్చిన రాంబాబు కుటుంబ సభ్యులు సంబంధిత విరాళాన్ని చెక్కు రూపంలో మే ఐ హెల్ప్ యూ కేంద్రంలో సూపరింటెండెంట్ సునీల్‌కు అందజేశారు. కార్యక్రమంలో దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యుడు దొడ్డి రమణ, పీఆర్‌వో నాయుడు పాల్గొన్నారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
భీమిలి
9666125299, 9912440606

పైప్‌లైన్ల నుంచి నీరు వృథా



చావుల మదుం రోడ్డులో పైప్‌లైను నుంచి వృథాగా పోతున్న నీరు నాచుకట్టిన దృశ్యం



గుడివాడ వంతెన అప్రోచ్ రోడ్డులో వృథాగా పోతున్న నీరు

తగరపువలస: భీమిలి జోన్‌లో పలుచోట్ల శనివారం పైప్‌లైన్ల నుంచి నీరు వృథాగా పోయింది. ధారలుగా చిమ్మిన నీరు రోడ్లు, కాలువల నుంచి ప్రవహించగా గణేష్ థియేటర్ వద్ద రహదారి చెరువులా మారిపోయింది. చిట్టివలస చావుల మదుం రహదారిలో పలుచోట్ల రోజుల తరబడి నీరు పోతున్నందున ఇక్కడ నాచుకట్టింది. తరచూ పైప్‌లైన్ల నుంచి తాగునీరు లీకవుతున్నా అధికారులు శాశ్వతంగా అరికట్టే చర్యలు తీసుకోలేకపోతున్నారని కార్మికవాడ ప్రజలు అంటున్నారు.

వేసవి కాలం, విద్యుత్ సరఫరాలో ఇబ్బందుల కారణంగా ప్రజలకు పూర్తి స్థాయిలో నీటి సరఫరా చేయలేకపోతున్నారని... అలాంటి పరిస్థితుల్లో తాగు నీరు వృథాగా పోవడం బాధాకరమని వాపోతున్నారు. ఎండలు ఇలాగే కొనసాగితే నీటి ఎద్దడి ఏర్పడే ప్రమాదం ఉందని, నీటిని పొదుపుగా వినియోగించుకునేందుకు పైప్‌లైన్ల నుంచి వృథాను అరికట్టాలని తగరపువలస, చిట్టివలస పట్టణ ప్రజలు కోరుతున్నారు.

అరకొర మరమ్మతులతో రోడ్డు గతుకులమయం



గోతులమయమైన గొల్లల తాళ్లవలస – దొరతోట రోడ్డు

తగరపువలస: భీమిలి మండలం తాళ్లవలస పంచాయతీ గొల్లల తాళ్లవలస నుంచి దొరతోటకు వెళ్లే రహదారి మరమ్మతులకు 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వం రూ.10 లక్షలు కేటాయించింది. 750 మీటర్ల దూరం కలిగిన ఈ రహదారికి కాంట్రాక్టర్లు అప్పట్లో గోతులు పూడ్చకుండా అక్కడక్కడ తారు పూసి డబ్బులు కాజేశారు. నాణ్యత పాటించకుండా ఈ అరకొర మరమ్మతులు చేపట్టిన రెండు నెలలకే వర్షాలు కురవడంతో రోడ్డు తిరిగి పాత స్థితికి వచ్చేసింది. ఈ మార్గంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లే రహదారిలో నాణ్యత పాటించకుండా చేసిన మరమ్మతులు ఇప్పటికీ వెక్కిరిస్తున్నాయి. రవాణా సౌకర్యాలు అంతగా లేని ఈ మార్గంలో గర్భిణులు, బాలింతలు ఆటోల్లో వస్తూ గుంతల కారణంగా కుదుపులకు లోనవుతున్నారు. ఈ బాధలు పడలేని వారు డబ్బులు పోయినా పరవాలేదంటూ అందుబాటులో ఉన్న ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. సంగివలస, వలందపేట, తాళ్లవలస, పెద్దిపాలెం గ్రామాల నుంచి పీహెచ్‌సీ, భీమిలి, కాపులుప్పాడ తదితర గ్రామాలకు వెళ్లేవారికి ఇదే దగ్గరిదారి. దీనికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అయినా మరమ్మతులు చేపట్టాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదకరంగా ప్రహరీ



రెండు భాగాలుగా విడిపోయిన బాలికల హైస్కూల్ ప్రహరీ

తగరపువలస: చిట్టివలస జెడ్పీ బాలికల హైస్కూల్ ప్రహరీ ముందు భాగంలో గేటును ఆనుకుని గోడ విడిపోయింది. ఇది ఏ క్షణమైనా కూలవచ్చని చుట్టుపక్కల వారు ఆందోళన చెందుతున్నారు. సోమవారం నుంచి స్కూళ్లు పునఃప్రారంభం కానున్నందున విరిగిన గోడను తొలగించి పునరుద్ధరించాలని కోరుతున్నారు. అలాగే ఇదే ప్రహరీపై కూలిన చెట్లు తొలగించాలని కోరుతున్నారు. హైస్కూల్ గేటుకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

శ్రీవారి ఆలయాల నిర్మాణానికి స్థలాల పరిశీలన



రామవరంలో స్థలాన్ని పరిశీలిస్తున్న ధర్మ ప్రచార పరిషత్ అధికారులు

ఎంవీపీకాలనీ: గ్రామీణ నియోజకవర్గాల్లో శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయాల నిర్మాణాలకు సంబంధించి పలు చోట్ల హిందూ ధర్మ ప్రచార పరిషత్ అధికారులు స్థలాలను పరిశీలించారు. భీమిలి నియోజకవర్గంతోపాటు పలు నియోజకవర్గాల్లో శనివారం స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా హిందూ ధర్మ ప్రచార పరిషత్ సూపరింటెండెంట్ ఎస్‌కేసీఎం శర్మ మాట్లాడుతూ గ్రామీణ నియోజకవర్గాల్లో శ్రీవారి ఆలయ నిర్మాణానికి తిరుమల తిరుపతి దేవస్థానం రూ.10 లక్షల వరకు ఆర్థిక సాయం చేస్తోందన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజల విజ్ఞప్తి మేరకు ఆయా గ్రామాల్లో ఆలయాల నిర్మాణానికి సహకారం అందించనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా భీమిలి నియోజకవర్గం పరిధిలోని పలు గ్రామాల్లో శనివారం పర్యటించి స్థలాలను పరిశీలించినట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, హెచ్‌డీపీ సిబ్బంది పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో రేపటి నుంచి ప్రవేశాలు

భీమునిపట్నం: ఆంధ్రప్రదేశ్ గురుకుల బాలికల పాఠశాలలో ఎంపికైన విద్యార్థులకు ఈ నెల 12 నుంచి 5, 6, 7 తరగతుల్లో ప్రవేశాలు కల్పించనున్నట్టు ప్రిన్సిపాల్, జిల్లా కో ఆర్డినేటర్ కోడి రాంబాబు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. భీమిలితోపాటు ఇతర పాఠశాలల్లో కూడా ప్రవేశాలు కల్పిస్తామన్నారు. ఇప్పటికే ఎంపిక జాబితా వెబ్‌సైట్‌లో పొందుపరిచామని, వారు పొందిన ర్యాంకును కూడా మొబైల్స్‌కి మెసేజ్ పంపించామన్నారు. వాటి ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తున్నామని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు ఆయా విద్యాలయాల్లో సంప్రదించాలని సూచించారు.

రెగ్యులర్ చేయాలని మంత్రికి వినతి



మంత్రికి సమస్యలు వివరిస్తున్న ఉద్యోగులు

మధురవాడ: ఏళ్ల తరబడి వైద్య ఆరోగ్య శాఖ టీబీ డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్న తమను రెగ్యులర్ చేయాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజనిని జిల్లా టీబీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో కంచరపాలెంలో కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి, మధురవాడకి చెందిన వీరబ్రహ్మం ఆధ్వర్యంలో వీరు కలిశారు. 20 ఏళ్లుగా కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్నట్టు చెప్పారు. ప్రజల కోసం ప్రాణాపాయ పరిస్థితుల్లో విధులు నిర్వహిస్తున్నట్టు మంత్రికి తెలిపారు.

కిటకిటలాడిన మధురవాడ రోడ్లు



మధురవాడ రహదారిపై శనివారం సాయంత్రం నిలిచిపోయిన వాహనాలు

సాయంత్రం ఒక్కసారిగా జనం రోడ్లపైకి రావడంతో స్తంభించిన ట్రాఫిక్

మధురవాడ: ఎండలు మండిపోవడంతో ఉక్కపోత, వడగాల్పులతో శనివారం ఉదయం 9 గంటల నుంచే జనం ఇళ్లకు పరిమితమయ్యారు. ఇంటిలో నుంచి అడుగు తీసి రోడ్డుపైకి వెళ్లాలంటే హడలిపోయారు. తప్పనిసరి పరిస్థితుల్లో సాయంత్రం కాగానే అంతా వివిధ పనులపై రోడ్లపైకి రావడంతో మధురవాడ పరిసర ప్రాంతాల్లో రహదారులన్నీ వాహనాలతో కిటకిటలాడాయి. ముఖ్యంగా కొమ్మాది, మధురవాడ అప్ బ్రిడ్జి, కార్‌షెడ్ కూడలి, క్రికెట్ స్టేడియం జంక్షన్, సర్వీసు రోడ్లలో భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. కొమ్మాది కూడలి నుంచి కార్‌షెడ్ జంక్షన్‌కి చేరుకోవడానికి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

రోడ్ల పక్కన వ్యర్థాలతో దుర్వాసన



వెంకటేశ్వరమెట్ట వద్ద రోడ్డు పక్కన చికెన్ వ్యర్థాలు, చెరకు పిప్పి

తగరపువలస: ప్రతి ఇంటికి, దుకాణాలకు చెత్త సేకరణకు డబ్బాలు ఇచ్చి, క్లాప్ వాహనాలు తిరుగుతున్నా చాలామంది అవగాహనా రాహిత్యంతో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. చెత్తను డబ్బాలలో వేసి వాహనాలకు ఇవ్వకుండా రోడ్ల పక్కన పడేస్తున్నారు. వెంకటేశ్వర మెట్ట నుంచి విజయనగరం రహదారి వాలు ప్రాంతంలో రోజూ టన్నుల కొద్దీ మాంసం వ్యర్థాలతోపాటు చెరకు పిప్పి వంటివి కుప్పలుగా పడేస్తున్నారు.

ఇటీవల భీమిలి జోన్ పారిశుధ్య సిబ్బంది తొలగించి శుభ్రం చేసినా మళ్లీ యథావిధిగా వ్యాపారులు వ్యర్థాలను డంప్ చేస్తున్నారు. దీంతో ఈ రహదారి వెంట రాకపోకలు సాగించేవారు దుర్వాసన భరించలేక ముక్కు మూసుకుని వెళ్లాల్సి వస్తోంది. ఈ ప్రాంతంలో చెత్త వేయకుండా పారిశుధ్య సిబ్బంది నిఘా ఉంచాలని వెంకటేశ్వర మెట్ట ప్రజలు కోరుతున్నారు.

ఆలయాల్లో విశేష పూజలు

పద్మనాభం: మండలంలోని ఐనాడలో నూతనంగా నిర్మించిన కోదండ రామస్వామి ఆలయంలో మూడు రోజులు నిర్వహించనున్న విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పుణ్యాహవచనం, అఖండ దీపారాధన, రక్షా బంధనం, తదితర పూజలు చేశారు.

- పాట్నూరులోని కోదండ రామస్వామి ఆలయంలో మూడు రోజులు జరగనున్న ధ్వజ స్తంభం, గోదా రంగ నాయకుల ఉత్సవ విగ్రహాల ప్రతిష్ఠ ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. విశేష పూజలు చేశారు.

'చంద్రంపాలెం'లో చురుగ్గా అడ్మిషన్లు

వారం రోజుల్లో 200 మంది చేరిక



విద్యార్థుల ధ్రువపత్రాలు పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు

మధురవాడ: నగరంలోని చంద్రంపాలెం (మధురవాడ) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అడ్మిషన్స్ ఉత్సాహంగా సాగుతున్నాయి. రాష్ట్రంలోనే పెద్దది అయిన ఈ పాఠశాలలో పిల్లలను చేర్చడానికి తల్లిదండ్రులు ఎక్కువ మక్కువ చూపుతున్నారు. పాఠశాల ప్రారంభం కాకముందే ఇక్కడి ఉపాధ్యాయులు రోజూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు అడ్మిషన్స్ నమోదు చేస్తున్నారు. శనివారం నాటికి వారం రోజుల్లోనే 200 మంది చేరారు. వీరిలో 180 మంది 6వ తరగతిలోనే చేరినట్టు ప్రధానోపాధ్యాయులు ఎమ్.రాజబాబు, జయప్రద చెప్పారు. పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న అమ్మఒడి, జగనన్న గోరుముద్ద, జగనన్న విద్యా దీవెన కిట్స్ వంటి వాటితోపాటు 'నాడు – నేడు' ద్వారా అదనపు తరగతి గదుల నిర్మాణం, గదుల ఆధునికీకరణ, అదనపు సదుపాయాల కల్పనతో విద్యార్థులు మరింత ఆసక్తి చూపుతున్నారు. విద్యార్థులను చేర్చుకోవడానికి ఇప్పటికే ఏర్పాట్లు చేసినట్టు ప్రధానోపాధ్యాయులు చెప్పారు.

ఆనందపురం ఫ్లై ఓవర్ కింద పశువుల తిష్ట



దూసుకొచ్చిన ఆవులను అదుపు చేస్తున్న ఆటోవాలా

- వాహనాలను అడ్డగిస్తూ రంకెలు
- ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం
- ప్రమాదాలకు ఆస్కారం

ఆనందపురం : ఆనందపురం జంక్షన్‌లో ప్రయాణమంటేనే టెన్షన్... ఏ వైపు నుంచి ఏ వాహనం దూసుకొస్తుందో తెలియని అయోమయం. ఇరుకైన రోడ్లు.. నాలుగు వైపుల నుంచి వచ్చే వాహనాలు ఒకే మార్గం గుండా ప్రయాణం... దీంతో ఇక్కడ ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇది చాలదన్నట్లు ఆనందపురం జంక్షన్‌లోని ఫ్లైఓవర్ కింద పశువులు తిష్టవేసి వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగిస్తున్నాయి. దీంతో ఆనందపురం జంక్షన్ గుండా ప్రయాణమంటేనే వాహన చోదకులు హడలి పోతున్నారు. కొంత మంది స్థానికులు ఆవులను మేత కోసం రోజువారీ మార్కెట్‌లో ఉదయాన్నే విడిచి పెడుతున్నారు. అవి మార్కెట్‌లోని వ్యర్థాలను తిని ఫ్లైఓవర్ కిందకి చేరి సాయంత్రం వరకూ తిష్ట వేస్తున్నాయి. ఫ్లైఓవర్ కింద ఉన్న దుకాణాల వద్దకూ అటూఇటూ కలియ తిరుగుతూ వాహనాల పైకి దూసుకు రావడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ఇక్కడ ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా ద్విచక్ర వాహనదారులు అదుపు తప్పి పడిపోతున్నారు. రోడ్డుకు అడ్డంగా ఆవులు తిష్ట వేయడంతో చోదకులు వాహనాలను నిలిపివేస్తే ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ఇక్కడ నిత్యం ఇదే పరిస్థితి ఉన్నా ఎవరూ పట్టించుకోవడంలేదని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆవులను రోడ్లపైకి విడిచిపెడుతున్న యజమానులపై చర్యలు తీసుకొని ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణానికి భూమి పూజ



ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న భక్తులు, అర్చకులు

పద్మనాభం: మండలంలోని కృష్ణాపురంలో వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ ప్రాంగణంలో అయ్యప్ప స్వామి మందిర నిర్మాణానికి శనివారం భూమి పూజ చేశారు. 108 మంది దంపతులు భూమి పూజ చేశారు. అనకాపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రధాన అర్చకులు రాజేటి గోప అప్పలాచార్యులు ఆధ్వర్యంలో వేద మంత్రోచ్చారణాల నడుమ పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు అనుమాలశెట్టి శ్రీనివాసరావు, పద్మనాభం సర్పంచ్ తాలాడ పాప, కృష్ణాపురం ఎంపీటీసీ సభ్యురాలు కంటుబోతు లక్ష్మి, మాజీ ఎంపీపీ దంతులూరి గోపాల కృష్ణ మూర్తి రాజు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కశిరెడ్డి దామోదరరావు, వైఎస్సార్‌సీపీ నాయకుడు తాలాడ పద్మనాభం, టీడీపీ నాయకుడు కంటుబోతు ఎర్నాయుడు, ఆలయ కమిటీ ప్రతినిధులు ముప్పంధం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

శిక్షణ.. ఉపాధికి రక్షణ



మిషన్లపై కుట్టు పని నేర్చుకుంటున్న మహిళలు

- మహిళలకు అండగా రోటరీ వైజాగ్ మెట్రో మహిళ సాధికారిత శిక్షణ కేంద్రం
- ఉచితంగా అల్లికలు, కుట్టు శిక్షణ
- 60 మందికి మిషన్ల పంపిణీ



శిక్షణ తరగతిలో మహిళలు, కేంద్రం నిర్వాహకులు

కొమ్మాది: ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న మహిళలు, వితంతువులు, ఒంటరి మహిళలకు అండగా నిలుస్తోంది రోటరీ వైజాగ్ మెట్రో మహిళా సాధికారిత శిక్షణ కేంద్రం. ఆర్థికంగా చేయూతనిచ్చే సంకల్పంతో కుట్టు పనిపై ఆసక్తి కలిగిన మహిళలను ఎంపికచేసి నాలుగు నెలలపాటు ఉచితంగా శిక్షణ ఇస్తున్నారు. శిక్షణ అనంతరం వారికి జీవనాధారంగా పనిని కూడా కేంద్రం నిర్వాహకులే కల్పిస్తున్నారు. రోటరీ క్లబ్ వైజాగ్ మెట్రో ఆధ్వర్యంలో జీవీఎంసీ 8వ వార్డు ఎండాడలోని కేంద్రంలో ఇప్పటి వరకు పూర్తి స్థాయిలో కుట్టు పని నేర్చుకున్న 60 మంది మహిళలకు ఉచితంగా మిషన్లు అందజేశారు. వారికి వివిధ కంపెనీల నుంచి ఉపాధి కూడా కల్పించారు. ప్రస్తుతం ఈ కేంద్రంలో సుమారు 50 మందితో మరో బ్యాచ్‌కు శిక్షణ కొనసాగుతోంది.

జూలైలో మరో బ్యాచ్ ప్రారంభం

ఆసక్తి కలిగిన మహిళల కోసం జూలైలో 4 నెలలపాటు శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు. ప్రస్తుతం శిక్షణ పొందుతున్న వారి తరగతులు జూలై మొదటి వారినికి పూర్తి కానున్నాయి. శిక్షణ పొందాలనుకునే వారు కనీసం 5వ తరగతి చదివి ఉండాలి. సాగర్‌నగర్, రుషికొండ, ఎండాడ, గుడ్లవానిపాలెం, తిమ్మాపురం ప్రాంతాల వారై ఉండాలి. ఆసక్తి గల వారు జూన్‌లో ఎండాడలోని కార్యాలయంలో ముందుగా పేర్లు నమోదు చేయించుకోవాలి. వీరు ఎటువంటి ఫీజు కట్టనవసరం లేదు. మిషన్, దారాలు, దుస్తులు అన్నీ ట్రస్ట్ నిర్వాహకులే సమకూరుస్తారు. వీరికి శిక్షణ ఇచ్చేందుకు అనుభవం కలిగిన సిబ్బందిని నియమించారు.

మహిళలకు బాసటగా...



మహిళలకు ఆర్థిక భరోసా కల్పించేలా ఉపాధి చూపించాలనే ఉద్దేశంతో రోటరీ క్లబ్ వైజగ్ మెట్రో ఆధ్వర్యంలో రోటరీ వైజగ్ మెట్రో మహిళా సాధకారిత శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించాం. ఇప్పటి వరకు ఈ కేంద్రం ద్వారా వందలాది మంది మహిళలకు శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించాం. ఉచితంగా కుట్టు మిషన్లు అందజేశాం. ఆసక్తి గల వారు సంప్రదిస్తే శిక్షణ ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాం. – సునీత లావణ్య, ప్రెసిడెంట్, రోటరీ క్లబ్ వైజాగ్ మెట్రో

అప్పన్నకు విశేషంగా నిత్య కల్యాణం



మాంగళ్యధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామికి శనివారం నిత్యకల్యాణం విశేషంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలో ఉదయం 9.30 గంటల నుంచి 10.30 వరకు కల్యాణాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను మండపంపైకి వేంజేపచేశారు. విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు. అర్చకులు సాతులూరి నరసింహాచార్యులు, శ్రీకాంతాచార్యులు తదితరులు కార్యక్రమం నిర్వహించారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
భీమిలి
9912220753
Office mail : sakshiadvtvsp@gmail.com